# ఇంక నువ్వు ఇక్కడే ఉండాలి

'అమ్మా శచీ' వెంకటరంగయ్య గారి పిలుపు.

నాన్నా అంటూ పలికి ప్రక్కగది నుండి మెల్లగా వచ్చింది శచి, ఎనిమిది నెలలు నిండిన గర్భవతి. ఇంతవరకు తండ్రి దగ్గరే ఉండి పరిచర్యలు చేసి వెళ్లిందో లేదో తండ్రి పిలుపు.

అర్థరాత్రి. పన్నెండు గంటలు. గోడమీది గడియారంలో కాలం నడవడంలేదు.

'సరస్వతికి ఉత్తరం రాసావా అమ్మా?'

'రాశాను నాన్నా. రమ్మని రాశాను. వస్తుంది నాన్నా. దగ్గర్లోనే వస్తుంది.'

'సరస్వతి చెప్తే వింటాడో ఏమో'.

సరస్వతి తన స్నేహితురాలు. తన క్లాస్‌మేట్. ఇప్పుడు విశాఖపట్నంలో ఉంది. కాలేజీ లెక్చరర్. నాన్నకి ఆమె అంటే ఎక్కడ్లేని ప్రేమ. వచ్చి ఆమె వారం దినాలు తమతో ఉంటేనే కాని నాన్నకు సరిపోదు.

వెంకటరంగయ్య గారికి దాదాపు రెండు నెలలుగా ఆరోగ్యం బాగాలేదు. గతపాతికేళ్లుగా ఉన్న డయబెటీస్ ఇప్పుడు ముదిరింది. ప్రాణాపాయంగా తయారయ్యింది.

కొడుకు ముకుందం స్వతంత్ర అభ్యర్థిగా రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీచేస్తున్నాడు. స్నేహితులు ఒత్తిడి తెచ్చి ముకుందంని నిలబెట్టారు. వాళ్లకు వెంకటరంగయ్య మేష్టారు గారంటే ప్రేమ. ఆరాధన భావం. వారి శిష్యులం అని చెప్పుకోవడం గర్వకారణం. పదిహేనేళ్లు ఆ చిన్నటౌన్‌లోని హైస్కూల్ హెడ్మాష్టరుగా వెంకటరంగయ్యగారు పనిచేసి అక్కడే పదవీ విరమణ చేశారు.

వెంకటరంగయ్య గారికి నిద్రరాదు.

ఎన్నికల జాతర. ఇంటి గోడల మీద ఎవరో నినాదాలు రాసుకుంటున్న సందడి.

కొడుకు ముకుందం ఎన్నికల్లో పోటీచేయడం ఆయనకి బొత్తిగా ఇష్టం లేదు. 'పెళ్లి పెళ్లి' అని తండ్రి ఎన్నిసార్లు బతిమాలినా కొడుకు పట్టించుకోలేదు. అది కూడా వెంకటరంగయ్య గారికి బాధగానే ఉంది. కొడుకు పెళ్లి తాను చెయ్యలేక పోతున్నాననే మానసిక ఆందోళన. పదేళ్ల క్రిందటే భార్య చనిపోయింది. అంతకు రెండేళ్ల ముందే కూతురు శచి పెళ్లి చేశారు. శచి కాపురానికి వెళ్లిపోయిన తర్వాత, భార్య చనిపోయిన

తర్వాత ఇల్లు ఎడారిలాగా తయారయింది. కోడలు పిల్ల ఇంట్లో అడుగుపెట్టే ఇల్లు మళ్లీ కళకళలాడుతుందన్న వెంకటరంగయ్య గారి ఆశ ఫలించలేదు.

తన ఆరోగ్యం రోజురోజుకు కొత్త కొత్త లక్షణాలతో క్షీణిస్తున్నదే తప్ప వైద్యానికి లొంగడం లేదు. ఇంతకన్న భయంకరమైన రోగాన్ని సైతం చేత్తో తీసేసినట్టుగా నయంచేసిన తన స్నేహితుడు పతంజలిశాస్త్రి ఆయుర్వేద వైద్యం పనిచేయలేదు. రోగం ముదిరిందని ఇప్పుడు అల్లోపతి వైద్యం. ప్చ్..... ఫలితం శూన్యం.

వారం దినాలయింది. కొడుకు ఇంటికి రావడంలేదు. ఎన్నికల ప్రచారంతో రాత్రింబగళ్లు నియోజకవర్గంలోని ఊళ్లల్లో తిరుగుతున్నాడు. ఊళ్లోకి వచ్చినా పార్టీ ఆఫీస్‌లోనే మకాం. అతను ఒక్కడేనా? అతడి స్నేహితులు, కార్యకర్తలు, అభిమానులు అంతా పార్టీ ఆఫీస్‌లోనే. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నది.

తండ్రి ఆరోగ్యం క్షీణించింది. తెలుసు...... కాని తండ్రిని చూట్టానికి క్కూడా అతడికి తీరిక చిక్కటం లేదు. కార్లల్లో, జీపుల్లో, తనకు మద్దతునిస్తున్న కార్యకర్తలతో, వాళ్ల సలహా మేరకు పరుగు తీయటమే....

* * *

ఆ చిన్నపట్నం తాలూకాఫీస్ కేంద్రం. బస్టాండ్ దగ్గర ఓ చింతచెట్టు ప్రక్కనే వచ్చీపోయే వాళ్లందరికీ కనిపించేట్టు, 'ఎర్రగులాబీకే మీ ఓటు. ముకుందం గారినే గెలిపించండి' అని పెద్ద పెద్ద అక్షరాలతో రంగురంగుల గులాబీ బొమ్మలతో పెద్ద బోర్డు. 'స్వతంత్ర అభ్యర్థి ముకుందంగారినే గెలిపించండి.' గోడలనిండా నినాదాలు. గులాబీపూల బొమ్మలు.

ఆ చింత చెట్టుకు ఇంకోవేపు ఏనుగు నిజంగా అక్కడికి వచ్చి ఆగిందా అనిపించేట్టు 'ఏనుగు గుర్తుకే మీ ఓటు. రామసుబ్బయ్యగారినే గెలిపించండి.' అని మరో పెద్ద బోర్డు.

తర్వాత ఆ టౌన్‌లో ఇండ్లు ఎన్నికల జెండాలతో, గులాబీలతో, ఏనుగులతో నిండిపోయాయి.

వీధుల్లో ఊరేగింపులు. ఓటర్ఫర్ నినాదాలు. సభలూ ఉపన్యాసాలు. జగడాలు.

కాలేజీ వెంటనే రావాలంటే.... ముప్పయి పడకల పెద్దాసుపత్రిని పెట్టించాలంటే..... కొళాయి నీళ్లు తాగాలంటే..... సోషలిజం రావలంటే...... పేదరికం పోవాలంటే.....

మా పార్టీనే గెలిపించండి.

రోడ్లమీద బేనర్లు, వాల్‌పోస్టర్లు, కరపత్రాలు.

ఎన్నికల రణరంగం. ప్రజాస్వామ్యం. ప్రజాసేవ. దేశభక్తి.

* * *

తండ్రి సేవలన్నీ కుమార్తె శచీదేవే చూసుకుంటున్నది. మధ్య మధ్య అల్లుడు రాజు వచ్చి, వారం పదిరోజులు పాటు ఉండి మామగారి సేవలు చేసి వెళ్తున్నాడు. అల్లుడు ఉన్న రోజుల్లో వెంకటరంగయ్య గారికి ఏచింతా ఉండదు.

అయితే కొడుకు రాజకీయాల్లో మునిగిపోవడం మాత్రం ఆయనకు ససేమిరా ఇష్టంలేదు. తమవంటి వారికి ఈ రాజకీయాలు పడవని ఆయన నిశ్చితాభిప్రాయం. రాజకీయాలు డబ్బున్న వాళ్ల సొత్తు. అధికారం వాళ్లదే. అధికారం అంటే డబ్బు. రామసుబ్బయ్య డబ్బున్నవాడు. ఆ జిల్లాలోనే అంతటి ధనవంతులు అయిదారుగురు కన్నా ఎక్కువ లేరు. పైగా ఇప్పుడు రామసుబ్బయ్య సిట్టింగ్ ఎమ్మెల్యే. అట్లాంటి వాళ్లతో పోటీపడటం బుద్ధి తక్కువ.

మంచం పట్టిన రంగయ్యగారికి మృత్యువు కబళిస్తున్న సంగతి తెలుస్తూనే ఉంది. వారికిప్పుడు బతుకు ఆశ కూడా లేదు. శాంతంగా చనిపోవాలని ఆయన భగవంతుని ప్రార్థిస్తున్నారు. విశాఖపట్నం కె జి హెచ్‌లో చేరుస్తానని అల్లుడు పట్టు పట్టున్నా ఒప్పుకోలేదు. నాకు ఈ ఇంట్లోనే చనిపోవాలని ఉంది. నన్ను ఎక్కడికి కదిలించవద్దు. నా ఆరోగ్యం సంగతి నాకు తెలుసు. అని అల్లుడిని వారించాడు.

తన చివరిశ్వాస ఆగిపోయినప్పుడు కళ్లముందు కూతురు, కొడుకు ఉండాలని వారి కోరిక. ఆ సంగతి కూడా అల్లుడితో అయన చివరికోరికగా చెప్పారు. తనకు ఇప్పుడీ మంచమే సర్వస్వం. ఇక్కడ నుండి ఎక్కడికీ కదలడం ఆయనకు ఇష్టంలేదు.

రోజు ఆయన్ని చూట్టానికి ఇప్పుడు పెద్ద పెద్ద ఉద్యోగాలలో, హోదాలలో ఉన్న తన పాత విద్యార్థులూ, స్నేహితులూ, బంధువులూ వస్తూనే ఉన్నారు.

ఇప్పుడు తనకు వైద్యం చేస్తున్న డాక్టర్ భుజంగం కూడా తన విద్యార్థే.

అనుకోకుండా ఆ రోజు వారి స్నేహితుడు పురుషోత్తం, వెంకటరంగయ్య గారిని చూట్టానికే ప్రత్యేకంగా, ఈ ఊరు వచ్చాడు. ఒకప్పుడు వెంకటరంగయ్య గారితో ఆయన ఈ ఊళ్లోనే బి.ఇడి ఉపాధ్యాయుడుగా ఎనిమిదేళ్లు చేశాడు. అప్పుడు ఇద్దరూ గొప్ప స్నేహితులు. తర్వాత ఉద్యోగం వదిలేసి పురుషోత్తం హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడ లెక్చరర్‌గా చేరాడు. తర్వాత కొన్నాళ్లు ఢిల్లీలో ఓ పెద్ద కంపెనీలో పెద్ద ఉద్యోగంలో చేరి ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌కి పెర్సనల్ సెక్రటరీ అయినాడు.

ఇప్పుడాయన కొడుకుల దగ్గర అమెరికాలో ఆర్నెలలు ఇండియాలో ఆర్నెలలు గడుపుతున్నాడట. వాళ్లావిడ కూతురు ఒక్కతే అవుతుందనీ ఆమె మాత్రం హైదరాబాదులోనే ఇప్పుడు ఉంటున్నది.

చాలా సేపు ఆయన వెంకటరంగయ్య మేష్టారు గారి మంచం దగ్గరే కూర్చున్నాడు. స్నేహితులు ఇద్దరూ ముచ్చట్లు చెప్పుకున్నారు.

పురుషోత్తం గారు ఇంట్లోకి వచ్చినప్పుడు పరిశీలనగా ఆయన్ని శచి చూడలేదు. తర్వాత నాన్న పిలిచి చెప్పినప్పుడు గుర్తుపట్టి ఉప్పొంగిపోయింది.

'ఎన్నాళ్ల తర్వాత రావటం బాబాయి' అని మురిసిపోయింది. 'అమ్మ ఎట్లా ఉంది బాబాయి' అని తమ్ముళ్ల గురించి, చెల్లెలు శ్యామల గురించి వివరాలన్నీ మరీమరీ అడిగి తెలుసుకుంది.

పురుషోత్తం మనసంతా ఆ అమ్మాయి ప్రేమతో, మానవతా పరిమళాలతో నిండిపోయింది.

'శ్యామలను తీసుకు రాలేకపోయారా బాబాయి' అని తన స్నేహితురాలిని గుర్తుచేసుకుంది. శ్యామల ఇంకా పెళ్లిచేసుకోలేదని మాత్రం తెలుసు. డాక్టరు. ఇప్పుడు హైదరాబాదులో ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో ఉద్యోగం. కార్డియాలజిస్ట్. శ్యామల ఈ ఊళ్లోనే హైస్కూల్‌లో తన క్లాస్‌మేట్.

'బాబాయి, తమ్ముళ్లు ఈ సారి ఇండియా వచ్చినప్పుడు శ్రీకాకుళం జిల్లాలోని ఈ ఊరు ఒకసారి వచ్చి చూసి రమ్మని పంపించండి బాబాయి. మేమున్నాం కదా. ఇక్కడ వాళ్లు చదువుకున్నారుకదా. ఆ మధ్య ఓ పాత విద్యార్థి, ఇప్పుడు న్యూజెర్సీలో ఉంటున్నాడట. తను చదువుకున్న స్కూల్ చూడాలని ప్రత్యేకంగా ఈ ఊరు వచ్చి, ఈ స్కూల్‌కి ఓ లక్షరూపాయలు విరాళం ఇచ్చి వెళ్లాడు బాబాయి. స్కూల్‌లో ఓ పూటంతా గడిపాడు బాబాయి. ఈ ఊరు తన స్వంత ఊరు కాకపోయినా తనుచదువుకున్న ఊరని ఆ ప్రేమ.....'

* * *

'వెంకటరంగయ్య మేష్టరు గారిని చూస్తుంటే పూర్వకాలం రుషులు గుర్తొస్తారు. తెల్లగా, పచ్చగా, పొడుగ్గా, ఆ ముఖంలో తేజస్సు' అన్నాడు లాయర్ గోవర్ధన్ రెడ్డి. ఆయన విద్యార్థికావటం తన భాగ్యం అని కూడా గోవర్ధన్ రెడ్డి చెప్పుకుంటాడు.

'మేష్టరు గారికి సీరియస్‌గా ఉందట' అన్నాడు సివిల్ కాంట్రాక్టర్ వెంకన్నచౌదరి. ఈ చౌదరి కూడా వెంకటరంగయ్య గారి శిష్యుడే. డాక్టర్ భుజంగం, రైస్‌మిల్లు యజమాని రామ్‌ప్రసాద్, తహసిల్దార్ నారాయణమూర్తి, స్టేషన్‌మాష్టర్ కృష్ణారావు అంతా అక్కడ లాయర్ గోవర్ధన్ రెడ్డి గారి ఇంట్లో డిన్నర్ ఆహ్వానంతో వచ్చారు. విందుభోజనం. గోవర్ధన్ రెడ్డి ఈ మధ్యనే మేజిస్ట్రేట్ కోర్టులో ఓ పెద్దకేసు గెలిచాడు. ఆ సంతోషంతో ఈ విందు ఏర్పాట్లు. అంతా ఎమ్మెల్యే రామసుబ్బయ్య కోసం ఎదురుచూస్తున్నారు. రామసుబ్బయ్యని తీసుకురావటం కోసం వెళ్లిన మెడికల్ షాప్ యజమాని సంగమేశం ఇంకా తిరిగి రాలేదు.

అంతా డాక్టర్ భుజంగం వేపు చూశారు.

'సీరియస్ అయిపోయింది. కేజీహెచ్‌కి విశాఖపట్నం తీసుకుని వెళ్తే.... ఏమో భగవంతుని దయ.....' అన్నాడు డాక్టర్ భుజంగం.

'కొడుకు ముకుందానికి రాజకీయల పిచ్చి పట్టింది' అన్నాడు తహసీల్దార్ నారాయణ మూర్తి బాధపడుతూనే.

'రాజకీయాలు పిచ్చి' అని కంట్రాక్టర్ వెంకన్నచౌదరి నిరాశగా పెదవి విరిచాడు.

ఆ ఇంట్లో విందుకోసం వచ్చి కూర్చున్న మిత్రుల్లో చౌదరిది భారీ విగ్రహం. అక్కడ వాళ్లనందర్నీ శాసిస్తున్నట్టుగా ఉందాయన గొంతు. అతడు వెంకటరంగయ్య గారి శిష్యుడు మాత్రమేకాదు ప్రియ శిష్యుడు. మేష్టారు గారి వైద్యం ఖర్చులు కోసమని వెళ్లిన ప్రతిసారి పైసలు అక్కడ పెట్టివస్తాడు. ఇప్పుడు ముకుందం మీద మాత్రం కోపంగానే కాకుండా అసహనంగా కూడా ఉన్నాడు. రామసుబ్బయ్యకు వ్యతిరేకంగా పోటీచేయడం అక్కడ వాళ్లు ఎవరూ సహించలేకపోతున్నారు.

'రామసుబ్బయ్య ఓడిపోయినా గెలిచినా ఒక్కటే. ఈ ఎన్నికల ఖర్చు లెక్కకి రాదు. అంత సంపాదించాడు. తరగని ఆస్థి. అట్లాంటివాళ్లకే రాజకీయాలు. ముకుందంలాంటి వాళ్లు బరిలో దిగడం... మనిషి మంచివాడు నిజమే. స్నేహితుల ఒత్తిడి తో నుంచున్నాడు అదీ నిజమే. కాని తండ్రి ఆరోగ్యం....' అన్నాడు తాసీల్దార్ నారాయణ మూర్తి.

రామసుబ్బయ్య వచ్చేవరకు ముచ్చట్లే. అక్కడ ముఖ్య అతిథి రామసుబ్బయ్యే. రామసుబ్బయ్య తమకి కావలసిన మనిషి.

'వెంకటరంగయ్య మాష్టారు గారి అనారోగ్యంకన్నా ముఖ్యమైనది - వాళ్ల అమ్మాయి. ఆమె కాన్పురోజులు దగ్గరపడుతున్నాయి. ఆమెకి ఇంట్లో ఆడ తోడు కూడా ఎవరూ లేరు. అల్లుడు వచ్చి పాపం సేవలన్నీ చేస్తాడు. ఈ మధ్య ఆ అల్లుడు సైతం కన్పించడం లేదు. కూతురు కాన్పు అయ్యేవరకన్నా మేష్టారుగారు బతుకుతారో లేదో' లాయర్ గోవర్ధన్ రెడ్డి.

రామసుబ్బయ్యని తీసుకురావటానికి వెళ్లిన సంగమేశం ఒక్కడే తిరిగివచ్చాడు.

'రామసుబ్బయ్య గారేరీ?'

'ఎక్కడో రెండు పార్టీల వాళ్లు కొట్టుకున్నారట. పోలీస్‌స్టేషన్‌కి వెళ్లారు. ఇప్పుడే వస్తామన్నారు.'

'ఉండి తీసుకు రమ్మని కదా నిన్ను పంపించింది' డా.భుజంగం.

గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

'సబ్‌ఇన్‌స్పెక్టర్ తో మాట్లాడుతున్నారు'

అంతలో వాళ్ల మాట్లాడుకునే విషయం తెలుగు సినిమాల మీదికి, తారల నటన మీదికి, తర్వాత జాతీయ రాజకీయాల మీదికి వెళ్లిపోయింది.

'గెలుపు ఓటములు దైవాధీనములు'

'ఏమయినా ముకుందం గెలవడం నభూతో నభవిష్యతి'

'ఎన్నన్నా చెప్పండి. ముకుందం తండ్రికి తగిన కొడుకు అన్నది యదార్థం'

'ఎవరి పిచ్చివారి కానందం అని పెద్దలు ఒత్తినే అన్లేదు'

* * *

తండ్రి చనిపోయే సరికి ముకుందం ఊళ్లో లేడు. ఎన్నికల ప్రచారంలో ఎక్కడ ఏ ఊళ్లో ఉన్నాడో కూడా ఒకంతట తెలియరాలేదు. చివరకు తెలిసింది. దాదాపు పదికిలో మీటర్ల దూరంలో రోడ్డు లేని గట్ల దారిలో కాలినడకన వెళ్లే ఊళ్లో ఏర్పాటు చేసిన సభలో పెద్దలతో మాట్లాడుతున్నడట. ప్రాథమిక పాఠశాలలు అ ఆలు నేర్పే పాఠశాల కూడా లేని గ్రామాలతో, ఏరకమైన వైద్యం కావాలన్న పట్నాలకు వెళ్లాల్సిన దుస్థితిలో ఉన్న పేద గ్రామాలతో ఈ దేశం ఎప్పుడు బాగుపడుతుంది. ఇంగ్లీషు వాళ్లతో పోరాడి మనదేశానికి స్వాతంత్ర్యం అయితే తెచ్చి పెట్టారు. కాని ఆ స్వాతంత్ర్యం వచ్చి, తొంబయి శాతం దేశంలోని ప్రజలకు, ఏం మేలుచేసింది అని ఆ పెద్ద మనుషులతో మహాత్మగాంధీ, జవహరలాల్ నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్‌ల గురించి చెప్తుండగా తండ్రి చనిపోయిన వార్త తెలిసింది.

ఆ విషాదవార్త తెలిసిన తర్వాత కాలినడకన దాదాపు అర్థగంటసేపు పరుగుపరుగున ఆ చీకట్లో పొలం గట్ల దార్లో నడిచి వచ్చిన తర్వాత జీప్ దొరికింది. ఆ జీప్ సగం దూరం వచ్చిన తర్వాత చెడిపోయింది. దాంతో సైకిళ్లలో స్నేహితులతో ఇల్లు చేరుకునే సరికి రాత్రి పది గంటలయింది.

ముకుందం వచ్చేసరికి ఇరుగు పొరుగు వాళ్లు, వెంకటరంగయ్య గారి అభిమానులు, స్నేహితులు, ఇంకా బంధువులూ దాదాపు పాతిక ముప్పయి మంది వరకు ఆ ఇంట్లో అన్ని గదుల్లో కన్నీళ్ల ముఖాలతో కన్పించారు. తమ్ముడు రావటం చూసి అక్క శచి దుఃఖాన్ని ఆపుకోలేక బావురుమని ఏడ్చింది.

అక్క శోకం కలచివేసింది ముకుందానికి.

తండ్రి పాదాల వద్దకి వచ్చి ఆ పాదాలకు తల ఆన్చి అక్కడే కుప్పకూలిపోయి ఏడవసాగాడు ముకుందం.

తండ్రి ఇట్లా ఇంత త్వరగా ప్రాణాలు విడుస్తాడని అతడు అనుమానించలేదు. ఇంకా కొన్నాళ్లు తండ్రి బతుకుతాడని భావించాడు.

'నాన్నా ముకుందం' అన్న తండ్రి పిలుపు చెవుల్లో మార్మోగసాగింది.

* * *

ముకుందం ఎన్నికల్లో ఓడిపోయాడు. కాలం కలిసి రాలేదు అన్నారు స్నేహితులు.

అతడిని ఓదార్చడానికి అతడి స్నేహితురాలు సరస్వతి, విశాఖపట్నం నుండి, వెంకటరంగయ్య గారి అంత్యక్రియలు జరిగిన రెండోరోజే వచ్చింది. ఆమె ముకుందంనీ, శచినీ, ఆ ఇంట్లో విషాదాన్నీ చూసి అవాక్కయింది. తర్వాత తనూ ఏడ్చేసింది.

మాటల్లేవు. కండ్లు ఒకర్నొకరు చూసుకుంటున్నాయి. వాళ్లకు ఏమీ కన్పించటం లేదు. మృత్యువు....

'ముకుందం, మనలాంటి వాళ్లకు రాజకీయాలు పెద్ద జూదం. గుర్రప్పందేలు కన్న పెద్ద జూదం. అంతే కాదు... అది ఒకసారి మనస్సులో చోటుచేసుకుందా - ఆ వ్యాధి మనిషిని తినేస్తుంది. మందుల్లేని రోగమిది' అని ఓదార్చి, అతడి కళ్లల్లోంచి కురుస్తున్న కన్నీటిని తన పైటచెంగుతో తుడిచింది. 'ముందూ వెనకా అంతే. అందరి దారి అక్కడికే' అని ఓదారుస్తూ, అతడి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది సరస్వతి.

ముకుందం దుఖ్ఖం మరోసారి ఉప్పొంగింది.

ఆమె చేతుల్ని తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు ముకుందం.

'ఇంక నువ్వు ఇక్కడే ఉండాలి.' అన్న అతడి మాటలు.....

ఇప్పుడు సరస్వతి కళ్లల్లో కన్నీళ్లు...... సంతోషంతో పొంగిన కన్నీళ్లు. ఆ మాటకోసం ఆమె గతఏడెనిమిదేళ్లుగా  ఎదురుచూస్తున్నది.

'ఇంక నువ్వు ఇక్కడే ఉండాలి.....' అన్నాడు ముకుందం.

నీతోడు కావాలి..... కలిసి బతుకుదాం అనుకున్నాడు లోలోపల.

*

*'తరుణ' సాహితీ మాస పత్రిక అక్టోబర్ 1971*